క్లుప్తంగా

16న మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.బాలశంకరరావు శనివారం తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. సదరు నివేదికలను ఒక రోజు ముందుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారికి అందజేయాలని తెలిపారు. సమావేశానికి అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

కల్లాల్లో మిర్చి మాయం

గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామంలోని కల్లంలో ఆరబోసిన మిర్చిని శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన షేక్ బాజీ మిర్చి కోసి కల్లంలో ఆరబోశాడు. దాదాపు మూడెకరాల మిర్చి కల్లంలో ఆరబోశాడు. తెల్లవారుజామున వచ్చి చూడటంతో మిర్చి అపహరణకు గురైందని గుర్తించి చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామాల్లో కల్లాల్లోని మిర్చి అపహరణకు గురవుతుందని, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

గనిఆత్కూరు(కంచికచర్ల): విద్యార్థులు ఉన్నత జీవితానికి చేరువకావాలంటే విద్యార్థి దశలోనే పునాది వేసుకోవాలని మైత్రీ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గనిఆత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తేనే ఉన్నతమైన విద్యలో రాణిస్తారన్నారు. పదవతరగతి చదివిన తర్వాత పలు రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని మంచి ఉన్నతమైన కోర్సు తీసుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పులి గోపీ, నరేష్, హెచ్ఎం ఎం.రంగారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మార్కింగ్



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద అభివృద్ధి పనులకు శనివారం మార్కింగ్ చేశారు. ఆలయ వద్ద సుమారుగా రూ.4.75 కోట్లతో నిర్మించనున్న కేశఖండనశాల, సులభ్ కాంప్లెక్స్ భవనాల నిర్మాణానికి చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు మార్కింగ్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ రాజు, కంట్రాక్టర్ కాటేపల్లి రవికుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ ఫోర్త్ క్లాస్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా సువర్ణరాజు

మైలవరం: పంచాయతీరాజ్ జిల్లా పరిషత్ ఫోర్త్ క్లాస్ ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి కృష్ణా జిల్లా నూతన అధ్యక్షుడిగా చాట్ల సువర్ణరాజు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కార్యదర్శిగా పీ రవికిరణ్, గౌరవ అధ్యక్షుడుగా ఆర్.ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు చాట్ల సువర్ణరాజు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధికి, సభ్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు కే గోవిందరాజు, రాష్ట్ర కార్యదర్శి వీ.లక్ష్మయ్య, ఉద్యోగులందరికి ధన్యవాదాలు తెలిపారు.

చిత్రకారుడికి జాతీయ అవార్డు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గిరిజనుల జీవనశైలితోపాటు పలు సామాజిక అంశాలపై అనేక చిత్రాలను కాన్వాస్‌పై మలిచిన గీత శిల్పి, భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీకి చెందిన డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావుకు 'ఇండియన్ ప్రెస్టీజియస్ హనర్' అవార్డు లభించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 'డ్రీమ్ పెయింట్ బ్రష్' సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో గిరిజన మహిళల జీవన విధానాన్ని ప్రతిబింబిస్తూ తాను గీసిన చిత్రానికి ఈ అవార్డు దక్కిందని చిత్రకారుడు డాక్టర్ జగన్ మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పోస్ట్ ద్వారా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. వివిధ సామాజిక అంశాలపై సుమారు 1000కుపైగా చిత్రాలను గీసిన తనకు వందకు పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన జీవితాలను ప్రపంచానికి తెలియ చెప్పాలనే లక్ష్యంతోనే వారి జీవన శైలికి సంబంధించిన చిత్రాలను గీస్తున్నానని వెల్లడించారు. గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. చిత్రకళ సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని, చిత్రకారులు ఆ దిశగా చిత్రాలను గీయాలని సూచించారు. ఆయనకు చిత్రకారులు, సన్నిహితులు అభినందనలు తెలిపారు.

ప్రజల దీవెనలే సీఎం జగన్‌కు బలం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



చిరు వ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

కంచికచర్ల: ప్రతి గడపలో సంక్షేమ పథకాలు అందివ్వాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని, ప్రజల దీవెనలే సీఎంకు కొండంత బలమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని పరిటాల గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంట తమకు ప్రభుత్వం ద్వారా లక్షల్లో లబ్ధి చేకూరిందని మహిళలు తెలియజేస్తున్నారన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు..

ప్రజలందరికీ అన్ని విధాలుగా మేలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే చెప్పారు. పార్టీలు, కులాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎంను ప్రజల గుండెల్లో నిలుపుకున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ, దేశ చరిత్రలోనే ప్రజలకిచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ అన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అర్హతగల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయటంతో పాటు ప్రతి నెల ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ చేస్తున్న ఏకై క రాష్ట్రం మనదే నన్నారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, సర్పంచ్ యద్దనపూడి ఆనందజ్యోత్స్న, ఎంపీటీసీ సభ్యురాలు కర్ల రాధిక, నాయకులు చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, యద్దనపూడి విజయారావు, జాన్‌బాబు, జమలయ్య, నరసింహారావు, కర్ల రామకృష్ణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, ఎంపీడీఓ బాలశంకరరావు, వీఆర్వో శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



యువకుడికి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

లోక్‌అదాలత్‌లో 2,995 కేసుల పరిష్కారం

జగ్గయ్యపేట: రాజీ మార్గం ద్వారా కక్షిదారులకు ఎంతో మేలు జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి అన్నారు. స్థానిక కోర్టులో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు కేసులను విచారించి పరిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజీ మార్గం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా ఏళ్ల తరబడి పరిష్కారం కాని కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 1560 కేసులను పరిష్కరించారు. వాటిలో క్రిమినల్ 1526, సివిల్ ఏడు, బ్యాంకు రికవరీలు 16, ఎక్సైజ్ కేసులు మూడు, చెక్‌బౌన్స్‌లు ఐదు, మనోవర్తి కేసులు మూడు పరిష్కరించి నష్టపరిహారం కింద రూ.21.42 లక్షలను అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు ధనుంజయుడు, నరసింహారావు, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి శోభారాణి



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జిల్లా 16వ అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

నందిగామ: లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులు కేసులను సత్వరం పరిష్కరించుకోవాలని జిల్లా 16వ అదనపు జడ్జి వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కోర్టుల ఆవరణలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం అందుతుందన్నారు. దీనివల్ల కక్షిదారుల సమయం, సొమ్ము ఆదా అవుతాయని చెప్పారు. ఇరువర్గాలు రాజీ పడితే లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చునని, ఒకే రోజులో కేసుకు పరిష్కారం లభిస్తుందన్నారు. లోక్ అదాలత్‌ను న్యాయమూర్తులు వి.లక్ష్మీరాజ్యం, సి.రమణారెడ్డి, మహాలక్ష్మి నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా మొత్తం 1,435 కేసులు పరిష్కారం కాగా ఆయా కేసుల ద్వారా రూ 2,42,49,900 కోట్ల నష్టపరిహారాన్ని అందజేశామన్నారు.

విద్యార్థుల వినూత్న ఆవిష్కరణ

కంచికచర్ల: ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు సాంకేతికమైన, నాణ్యమైన విద్య నందించటంతో పాటు నూతన ఆవిష్కరణలు చేసేందుకు మంచి తర్ఫీదు ఇస్తున్నామని కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ కె.రామ్మోహన్‌రావు అన్నారు. మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఈఈఈ బ్రాంచి విద్యార్థులు సౌరశక్తితో నడిచే వాహనాన్ని తయారు చేసి ఆవిష్కరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, ఈఈఈ నాల్గవ సంవత్సరం చదువుతున్న సీహెచ్ వీరయ్య, టి.సుహాసినీ, తన తోటి విద్యార్థులతో కలసి సౌరశక్తితో నడిచే వాహనాన్ని తయారు చేశారన్నారు. ఒకసారి చార్జింగ్ చేయటం ద్వారా 120 కిలోమీటర్ల దూరం ప్రయాణం సాగించవచ్చని తెలిపారు. ఈ వాహనం తక్కువ శక్తిని వినియోగించుకోవటంతో పాటు ఎక్కువ శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటాయని తెలిపారు. 200 కేజీల బరువుగల వాహనాన్ని 600 కేజీల బరువును లాగే విధంగా, ఆరుగురు వ్యక్తులు ప్రయాణించేలా డిజైన్ చేశారన్నారు. విద్యార్థులు తమ మేధాశక్తిని ఉపయోగించి దేశానికి ఉపయోగపడేలా మరిన్ని నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సౌరశక్తితో నడిచే వాహనంతో అమ్రితసాయి కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

ఇబ్రహీంపట్నం: ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా పవిత్ర సంగమం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అవసరమైన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. స్నానఘాట్లలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు, పిండ ప్రధానం చేసేందుకు ప్రత్యేక టెంట్లు, భక్తులకు తాగునీరు, వైద్యశిబిరం, రవాణా, వాహనాల పార్కింగ్, పారిశుద్ధ్యం చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. చురుకుగా పనులు చేపట్టాలన్నారు.

ఏటీఎం కేంద్రం మార్పు

మైలవరం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ విజయవాడ ఏఓ కే రంగరాజన్ శనివారం తెలిపారు. మైలవరంలోని నారాయణ థియేటర్ కాంప్లెక్స్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంను పక్కనే ఉన్న ఎస్‌వీఎస్ ఏజన్సీస్ పెట్రోల్ బంక్ ప్రాంగణంలోనికి మార్చారు. వినియోగదారులు లావాదేవీలను యథావిధిగా కొనసాగించుకోవాల్సిందిగా కోరారు. విజయవాడ నార్త్ రీజనల్ మేనేజర్ పీ రాధిక, మైలవరం బ్రాంచ్ మేనేజర్ కే శ్రీరామచంద్రమూర్తి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం: బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పసాని రామకృష్ణ అన్నారు. ఎన్టీటీపీఎస్ సంఘం కార్యాలయంలో ఉద్యోగుల సమావేశం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ బీసీల ఆరాధ్యదైవం బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణ ఈనెల 12న గుంటూరులో జరుగుతుందన్నారు. ఉద్యోగులు విజయవంతం చేయాలన్నారు. ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, పుల్లారావు, శ్రీహరి, మాధవరావు, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకల్లు పోలీస్‌స్టేషన్ నూతన భవన ఏర్పాటుకు వినతి

జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు పోలీస్‌స్టేషన్ నూతన భవన ఏర్పాటు నిమిత్తం స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనితకు ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విన్నవించారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆమెను కలిసి ఈ మేరకు విన్నవించారు. చిల్లకల్లు నుంచి మక్కపేట వరకు రోడ్డు విస్తరణ జరగనుందని ఈ విస్తరణలో ప్రస్తుతం ఉన్న పోలీస్‌స్టేషన్ కొంత భాగం పోయిందని ఆయన చెప్పారు. అయితే సమీపంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించి నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలంటూ మంత్రిని కోరారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించి, తదనుగుణంగా కృషి చేస్తానని తెలిపారని ఉదయభాను తెలియజేశారు.



మంత్రి తానేటి వనితతో విప్ ఉదయభాను

యుద్ధప్రాతిపదికన కల్వర్టు పునరుద్ధరణ

జగ్గయ్యపేట: పట్టణంలోని వార్డు ప్రజలు సమస్యలను ఎప్పటికప్పుడు మున్సిపల్ సిబ్బందికి తెలపాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. ఆరవ వార్డులో ఇటీవల కల్వర్టు ధ్వంసమైన నేపథ్యంలో ప్రజల రాకపోకల దృష్ట్యా శనివారం యుద్ధప్రాతిపదికన సిబ్బందితో పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో సమస్యలను కౌన్సిలర్‌లు, సిబ్బందికి తెలపాలని కోరారు. డ్రైనేజీలు కూడా నూతనంగా నిర్మిస్తున్నామని చెప్పారు. పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వట్టెం మనోహర్, ఖాదర్‌బాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టును నిర్మిస్తున్న సిబ్బందితో వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్

మోడల్ పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ



రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ ఆదర్శ పాఠశాల నందు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు 10వ తరగతి మోడల్ పరీక్ష పోస్టర్‌ను శనివారం ఆవిష్కంచారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వీర్రాజు చేతుల మీదుగా గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రెడ్డిగూడెం మండల నాయకులు కే బాలు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రజ్ఞా వికాసం పేరుతో 10వ తరగతి మోడల్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 20వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనాలని సూచించారు.

దుర్గగుడి అభివృద్ధికి దోహదపడాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి పాలకమండలి సభ్యులు దోహదపడాలని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి నూతనంగా ఎన్నికై న పాలకమండలి సభ్యులు కేసరి నాగమణి, కట్టా సత్తెయ్యలను వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లెల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి వారికి శాలువా కప్పి అభినందించారు. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు వస్తుంటారని, వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని సత్కార గ్రహీతలకు సూచించారు. కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, బాపతి కోటిరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యులు కేసరి సుబ్బారెడ్డి(చిన్నోడు), కేసరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని పాలకమండలి సభ్యులను అభినందించారు.

కూడలి తిరునాళ్ల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నందిగామ: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన తిరునాళ్లలో ఒకటైన కూడలి తిరునాళ్లను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసన సభ్యుడు సామినేని ఉదయభాను సూచించారు. ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న కూడలి సంగమేశ్వర స్వామి తిరునాళ్ల మహోత్సవాల ప్రచార వాల్‌పోస్టర్‌ను శనివారం ప్రభుత్వ విప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరునాళ్లకు వచ్చే భక్తులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అత్యవసర సర్వీసుల శాఖలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని, ఎండల తీవ్రత పెరుగుతున్నందున మంచినీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, స్వామి వారి దర్శనం కోసం బారులు తీరే భక్తులకు నీడనిచ్చేందుకు షామియానాలు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా పుణ్య స్నానాలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, ఆలయ పాలకవర్గ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, ఈఓ వాసిరెడ్డి భూపాల్, చెరుకూరి రమేష్, కొలకలూరి వెంకటేశ్వరరావు, నరసింహారావు, రంగశెట్టి శ్రీనివాసరావు, ఆలయ అర్చకుడు శ్రీనివాస శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.



తిరునాళ్ల ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

కంచికచర్ల: వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్‌లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ సకాలంలో త్వరతిగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.బాలశంకరరావు పేర్కొన్నారు. మండలంలోని పేరకలపాడు గ్రామంలో హౌసింగ్ డే సందర్భంగా లబ్ధిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఎంపీడీఓ మాట్లాడుతూ.. వైఎస్సార్ కాలనీలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. నీటి వసతి, ఉచితంగా ఇసుక, విద్యుత్ సౌకర్యం, రోడ్లు అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తయితే సకాలంలో ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తోందన్నారు. మండల స్థాయి అధికారులు ప్రతి శనివారం జగనన్న కాలనీ లే అవుట్లలో పర్యటించి లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా చూడాలన్నారు. ఇంటి నిర్మాణ సమయంలో డ్వాక్రా మహిళలకు రుణాలు కూడా మంజూరు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు వేమవరపు పురుషోత్తం, హౌసింగ్ ఏఈ ఏ.నరసింహారావు, ఏపీఎం కోట భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో సురేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పేరకలపాడులో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ బాలశంకరరావు

ప్రవచనకర్త చాగంటికి ఘన సత్కారం

పెద్దాపురం(వీరులపాడు): ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లు ఘనంగా సత్కరించారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో దాసాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి చాగంటి ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ.. భగవతారాధనతో ప్రశాంతతతో కూడిన జీవనాన్ని సాగించవచ్చన్నారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్‌లు మాట్లాడుతూ చాగంటి కోటేశ్వరరావు మా ప్రాంతానికి రావటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆవుల రమేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, నాయకులు గరికపాటి భాస్కరం, నల్లమల్లి మురళి, బబ్బెళ్లపాటి గోపాలకృష్ణ సాయి, వెలది సుగుణశేఖరరావు పాల్గొన్నారు.



చాగంటిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్

సమాజ శ్రేయస్సుకు టెక్నాలజీ దోహదం

కేంద్ర రక్షణ శాఖ మంత్రి సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి

మైలవరం: టెక్నాలజీని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలని, తద్వారా లబ్ధి పొందాలని కేంద్ర రక్షణ శాఖా మంత్రికి పరిశోధనా సలహాదారు డాక్టర్ జీ. సతీష్‌రెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సతీష్‌రెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీలో వచ్చే మార్పులకు అనుగుణంగా తమ భవిష్యత్తుకు రూపుదిద్దుకోవాలన్నారు. విద్యార్థులు పరిశోధనా, ఇన్నోవేషన్లలో దృష్టి సారిస్తే ఆయా రంగాలలో వారు అనుకున్నది సాధిస్తారని తెలిపారు. ఈ కళాశాల జిల్లా స్థాయిలో విద్యార్థులకు కావలసిన సకల సదుపాయాలు ఉన్న ఏకై క కళాశాల అని అన్నారు. ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ కే.హేమాచంద్రారెడ్డి మాట్లాడుతూ కమ్యూనికేషన్స్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్‌లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలన్నారు. లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ చైర్మన్ దివంగత లకిరెడ్డి బాలిరెడ్డి దార్శనికతతో మెట్ట ప్రాంతమైన మైలవరంలో విద్యా దానం గురించి వివరించారు. బాలిరెడ్డి స్వగ్రామం వెల్వడం గ్రామాభివృద్ధికి, మైలవరానికి వారు చేస్తున్న కృషిని వివరించారు. జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ డాక్టర్ జీ.వీ.ఆర్.రాజు, ప్రవాసాంధ్రులు కళాశాల చైర్మన్ లకిరెడ్డి ప్రసాదరెడ్డి, లకిరెడ్డి సోదరులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కళాశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ కుడుముల తిమ్మారెడ్డి, గోగులమూడి సత్యనారాయణరెడ్డి ప్రసంగించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, అవార్డులు, వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే.అప్పారావు, కళాశాల ప్రసిడెంట్ జీ.శ్రీనివాసరెడ్డి, జీ.సాంబశివారెడ్డి, గ్రామ ప్రముఖులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవంలో వేదికపై ప్రముఖులు

దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం

విస్సన్నపేట: స్థానిక గంగా పార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానం నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం శనివారం నిర్వహించారు. నూతన పాలకవర్గంతో ఆలయ ఈఓ వై సీతారామయ్య సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. పాలక వర్గ సభ్యులు రామవరపు దుర్గాప్రసాద్, కోటా పద్మావతి, మనుసు ప్రసాద్, మేకల నాగరాజులు కలసి కుక్కడపు హనుమాన్ వెంకటరత్నంను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు,వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఎంపీటీసీ జి మల్లయ్య,వార్డు సభ్యుడు పిల్లి రాజేష్,పార్టీ నాయకులు కోట కిట్టు, మాధవరెడ్డి, అబ్బినేని హరి,పెండెం సత్యనారాయణ,బోనం మహేశ్వరరావు పాల్గొన్నారు.



సభ్యులతో ఆలయ ఈఓ సీతారామయ్య, ఎంపీపీ మెర్సీవనజాక్షి